# బీడు భూమి

**ఉ**దయం సరిగ్గా పదిన్నరకు బ్యాంకు తాళాలు తీయగానే బయటి జనం లోపలికి తోసు కొచ్చారు.

ఆ మందలో నుండి విడిపోయి పరుగులాంటి నడకతో హాలు మధ్యలో - ఇంకా సీట్లో సెటిల్‌కాక కుర్చీ ముందు నిలచి తన టేబుల్‌ని తన కర్చీఫ్‌తోనే తుడుచు కుంటూ ఎదురుగా ప్రత్యక్షమైన వ్యక్తి నోటి నుండి గుప్పు గుప్పుమంటూ వస్తున్న గుట్కా కంపువాసన తన ముక్కు లోకి చొచ్చుకుపోవడంతో ఆంజనేయుడి మూతిలా బెట్టి పిడికిలితో ఏంకావాలన్నట్లు సౌంజ్ఞ చేశాడు ఫీల్డాఫీసర్ గిరీశం.

''నమస్కారం సార్...!'' వినయంగా ఓ నమస్కారం విసిరాడు, వెంకటేశం.

''నమస్కారం! సరేగానీ ఏం కావాలయ్యా నీకు?'' అంటూ విసుక్కుంటూ కుర్చీలో కూలబడ్డాడు గిరీశం.

''లోనండి''

'మొదలైందీ తలనొప్పి... బ్యాంకులంటే బేకూపులై పోయిన్నై జనం దృష్టిలో' అంటూ తనలోనే గొణు క్కుంటూ- ''అదే స్టేటు గవర్నమెంటు ఆఫీసులోనైతే పదకొండున్నరయినా వచ్చి చావరు స్టాఫ్... వాళ్ళెట్టా గయినా లేటుగా వచ్చి చస్తారనీ - వచ్చి టీ స్టాల్‌లో టీ, సిగరెట్లు తాగి వచ్చే వరకు వేట్ చేస్తారు... అదే బ్యాంకు లనేసరికీ పదిన్నరలోగా తెరువరని తెలిసినప్పటికీ పది గంటలకే వచ్చి గుడ్డి కొంగల్లా కాచుక్కూచుంటారు...'' అంటూ విస్కున్నాడు కోపంగా గిరీశం. ఆ విసుగులో స్టేటు గవర్నమెంటు ఎంప్లాయిస్‌పై ఈర్ష్య వ్యక్తమయింది. ఆ కోపం ఎదురుగా వున్న వెంకటేశంను వణుకు పుట్టించింది.

''సరే సార్...! మీ పని కానిచ్చుకోండి...'' అంటూ ఎదురుగా ఉన్న స్టూలుపై అతుక్కుపోయాడు వెంకటేశం.

'ఈ పెంట ఎప్పుడూ ఉండేదేగా! వీడ్ని త్వరగా డిస్పోజ్ చెయ్యకపోతే జుట్టులో పేనులా తిరుగుతూ దురద పెట్టిస్తడు...' అంటూ తనలో తానే గొణుక్కొని ''ఏంకావాలీ...!?'' అంటూ ప్రశ్నించాడు వెటకారంగా ఎదుటి వ్యక్తి ఆల్రెడీ వ్యక్తపరిచాడన్న విషయం తెలిసి కూడా.

''అదే... లోనండి...'' వెంకటేశం. కుడి చేయి ఎడమ చంకలోకి, ఎడమచేయి కుడిచంకలోకి చొచ్చుకుపోయి వినయంగా.

''ప్రస్తుతానికి బ్యాంకులోను ఫ్రీజింగుంది... ఓ నెల తర్వాత కనబడు అప్పుడాలోచిస్తాం...'' అబద్ధమాడుతున్నానని తెలిసి ఎదురుగా ఉన్న జిడ్డును వదిలించుకోజూశాడు గిరీశం. తిరిగి తానే ''వస్తూ ఆ గుట్కా కంపుతో రాకు...'' అన్నాడు వార్నింగుగా.

సరేనని తలూపాడు వెంకటేశం.

''మరింకా కూచున్నావేంటి...!?''

''అదే లోనండి...!''

''చెప్పాను కదయ్యా ఫ్రీజింగుందని...''

''మీ మాట తీరు చూస్తే నమ్మబుద్ధి అయితే లేదండి...!''

అమ్మనా పిడుగా అని నాలుక్కరుచుకొని ''ఇంతకీ లోను దేనికండీ...!'' అంటూ వెటకారంగా ప్రశ్నించాడు గిరీశం.

''రెండు వందల గజాల ప్లాటుందండి... అందులో చిన్న బడ్జెట్‌లో చిన్న ఇల్లు కట్టుకుంటున్నానండి... బెడ్రూం దగ్గరకొచ్చేసరికి... బేడ్‌లక్ బడ్జెట్ సరిపో లేదండి... ఇల్లు బెడ్రూం దగ్గరికి వచ్చి ఆగేసరికి మా యావిడ ప్రస్తుతం కిరాయికి ఉంటున్న ఇంట్లో నా బెడ్డు పైకి రాకుండా ఫుడ్డు కూడా సరిగా పెట్టడం లేదండీ... ఎప్పుడు చూసినా మూతి విరుపులు, ముక్కు చీదుల్లు...''

''ఆపూ... ఆపూ... మీ యావిడ

ఫుడ్డూ, బెడ్డూ

**కూతురు రాంరెడ్డి**

## రెక్కల హోరం

గడియారం
ఆగినా
కాలం
ఆగదు-
కాలం
'యంత్రం' కాదు
  చీకటి
  వెలుగు
  దేనికవే
  సాటి-
  బొమ్మ-బొరుసు
  కలిస్తే 'నాణెం'
మనిషైనా
జంతువైనా
బ్రతుకంటే
తీపే! -
ప్రకృతి సూత్రం-
జీవనేచ్ఛ!
  మట్టి
  అంటకుండా
  కుండలు
  చేయలేం-
  జీవనసారం-
  'మట్టి'
వర్షమూ
దుఃఖమూ
ఏదోనాటికి
ఆగవలసిందే!
ఒక విరామం-
'కాలం'
  సంతానం
  లేకున్నా
  సంపద
  వెనకేసుకుంటూ-
  బీడు చుట్టూ-
  కంచె!

గుద్దంటి రాజశేఖర్

---

సంగతుల్జెప్పి నా బుర్ర తినెయ్యకు ఇంతకీ నీ పేరు...?'' ఏదో నెపంతో అతడ్ని డిస్పోజ్ చెయ్యాలన్న తలంపుతో కాగితం, కలం తీసుకున్నాడు ఫీల్డాఫీసర్ గిరీశం.

''వెంకటేశం... సుగంధాల వెంకటేశమండి...'' తన పని లైన్లో పడుతున్నట్లు సంతోషపడ్డాడు.

'వీడి జిడ్డు మొహానికి ఇంటి పేరు సుగంధాలొకటి' అసహ్యంగా డోకొచ్చినట్లు గొణుక్కొని- ''పిల్లలెందరు?'' అని అడిగాడు గిరీశం.

''ఇద్దరండీ... ముందు కూతురండి... మాంచి దొరబాబును ప్రేమించి వైజాగులో జాగ తీసుకొని ఇల్లు కట్టుకొని సెటిలయినాదండి... ఇక కొడుకు... ఇంకా మూతి మీద మీసమైనా రాలేదని తెగ బాధపడిపోతున్నాడండి. తల్లిగ్గారాల కొడుకండి... ఇంటర్లోకి ఎంటరై చదువు మానేసి చిరంజీవి పార్టీ మందలో కలిసి తిరుగుతున్నాడండి... ఇంతకీ మనకెంతమంది పిల్లలండీ...!?'' ఆసక్తిగా గిరీశం మొహంలోకి చూశాడు వెంకటేశం.

''మనక్కాదు... నాకు...!'' కింద మంటబెట్టినయి... పళ్ళు పటపటా కొరికాడు గిరీశం.

''క్షమించండి సార్... పొరపాట్న నాల్క జారింది మీకు!?''

''ఇద్దరు''

''నాలాగే కూతురు కొడుకన్నమాట!''

''కాదు... కన్లేదు... ఇద్దరు పెళ్ళాలు... పెద్దావిడకు పిల్లలు పుట్టే యోగం లేదని చిన్నావిడను చేసుకుంటే ఇప్పటివరకూ ఫలితం దక్కలేదు... ప్చ్....'' నిరాశగా పెదవి విరిచాడు గిరీశం.

''అహో...! కుడి ఎడమల డాల్ కత్తులు మెరియగ... కత్తుల మెరిగయ... కత్తులు మెరియగ...'' చంకలు గొడ్తూ లయ బద్ధంగా వెంకటేశం నాలుక నడయాడింది పాటలా.

''ఏంటయ్యా వెంకటేశం... నీకు జోక్గా ఉందా... నిన్ను నమిలి మింగాలన్నంత కోపమొస్తుంది... కానీ తమాయించుకుంటున్నా... ఆడాలేందో- కత్తేందో ముందు వాటి సంగజెప్పు...'' కోపాన్ని తమాయించుకొని అద్దాలపై నుండి చూశాడు గిరీశం.

''భార్య అంటే కత్తి కదండీ! మీకు ఇద్దరు భార్యలాయే... అంటే... అంటే కోప్పడగ్గానీండి... మీకు కుడివైపొకరు-ఎడమవైపొకరు... రెండు కత్తులు మెరుస్తాయన్నమాట... ఆ కత్తుల నడుమ మీరు డాల్ అన్నమాట.... ఆ కత్తులు మెరుపుకు మీ డాల్ చార్జ్ డౌన్ అన్నమాట... ఏవైనా మీరు లక్కీఫెల్లో సార్... నాగ్గ

ట్లుంటే... నా సామిరంగా...!'' పెదవులు చప్పరించాడు వెంకటేశం.

''ఆ కత్తులతో నీ కుత్తుక తెగేది... ఆ సోదంతా ఎందగ్గాన్ని లోను కావాలంటున్నావు... లో లాకులు వున్నాయా....''

''లో లాకులేంటండే...!?''

''అదే నయ్యా...! నీ భార్య చెవిలో లోలాకుల్లాంటి వేవైనా ఉంటే గోల్డ్ లోనేమైనా పదో పదిహేనో దొరుకుతుందో చూద్దాం...''

''లోలాకుల్లేవుగానీ.... ఎకరం కండగల భూమి సిటీకి దగ్గరుందండి... ఎప్పుడూ బీడులేదు... పదునైన కర్రుతో దున్నుతున్నాను... ఇప్పటికీ...'' అంటూ ఓరకంట ఓ చిలిపి చూపు విసిరి జేబులో ఉన్న కాగితాల కట్టతీసి గిరీశం ముందుంచాడు.

పొగచూరిపోయి ముట్టుకుంటే మట్టంటుకు పోయేలా ఉన్న కాగితాల కట్టను తిరిగేశాడు గిరీశం... అన్నీ జిరాక్స్ కాపీలే. భూతద్దం వేసి వెతికినా అక్షరం ముక్క అర్థంకాకుండా ఏడ్చాయి. గిరీశానికి కోపం బుస్సున పొంగింది...

''ఈ పాడుబడ్డ జిరాక్స్ కాపీలు మంటబెట్టుకోవ డానికి కూడా పనికిరావు... ఒరిజినల్ డాక్యుమెంట్లతో రేపు కనబడు...'' అంటూ వెంకటేశం మొహం పైకి విసిరాడు.

''ఒరిజినల్ డాక్యుమెంట్లు లేకే కాదండీ...'' అంటూ ఏదో నసుగుతుండగా-

''చూడు వెంకటేశం- ఇప్పటికే నా టైమంతా వేస్ట్ చేశావ్... ఈ క్షణంలో ఇక్కడ నుండి నువ్వు కదలక పోతే...అటెండర్ని పిలవాల్సొస్తుంది...''అంటూ కోపంగా అరుస్తూ బెల్లు కొట్టబోయి వోచర్స్ స్టాండుపై చెయ్యి వేశాడు. అది అరచేతికి గుచ్చుకుంది. రక్తం కారింది. గిరీశం రక్తహస్తం చూసుకునేలోగా వెంకటేశం అక్కడి నుండి మాయమయ్యాడు.

❖ ❖ ❖

శనివారం రోజు. బ్యాంకులో రైల్వే స్టేషన్‌లాగా రద్దీగా ఉంది. ముఖ్యంగా రెండు క్యాష్ కౌంటర్ల దగ్గర జనం క్యూ కట్టి క్యాబిన్‌లోపల రిటైర్‌మెంటుకు సమీపంలో ఉండి కంప్యూటర్లతో కంగారుపడుతున్న అధికారుల జాప్యానికి సహనం కోల్పోయి బయటికి తిట్టలేక ఒకరి చెవులు ఒకరు కొరుక్కుంటున్నారు జనం.

ఫీల్డాఫీసర్ గిరీశం రివాల్వింగ్ ఛైర్‌లో తనకు ఎడమ వైపున ఉన్న విప్రో కంప్యూటర్‌లో గతవారం రోజుల్నుండి

## ఎక్కడున్నది ప్రగతి?

ఉదయపూర్ రాగి గనుల నుండి
ఉదయభానుడి దర్శనం చూస్తున్న
ఉదరం కోసం పాటు పడుచున్న
ఉదరపోషణ దారిలోనున్నదా ఈ ప్రగతి?
　　ధన్‌బాద్ బొగ్గుబావుల నుండి
　　దన్‌దన్ మను ధ్వనులు వింటున్న
　　దేహశక్తిలేని దారిద్ర్యమనెడి
　　దరిద్రునిలో నున్నదా ఈ ప్రగతి?
సింగరేణి గనుల గర్భంబునుండి
సదా బాధలు భరియించుచున్న
శక్తిహీనులై, శ్రమ చేయుచుండెడి
శ్రమదారునిలో నున్నదా ఈ ప్రగతి?
　　కోలారు బంగారు గనుల నుండి
　　కారు చీకటిలో కాయకష్టం చేస్తున్న
　　కడుపుకోత కలవాటుపడియున్న
　　కార్మికునిలో నున్నదా ఈ ప్రగతి?
సింగ్‌భమ్ ఇనుపగనుల నుండి
సూర్యాస్తమయాన్ని చూస్తున్న
సింకిరి గుడ్డల శరీరాకారమనెడి
సిక్కిన కార్మికునిలో నున్నదా ఈ ప్రగతి?
　　రాణిగంజె రాకాసి బొగ్గుబావుల నుండి
　　రణగొణ ధ్వనులు వింటున్న
　　రుధిరాన్ని దారపోయుచున్న
　　రౌద్ర కార్మికునిలో నున్నదా ఈ ప్రగతి?
బైలదిలా ఇనుప గనుల నుండి
బరువైన ఇనుప ఖనిజం మోస్తున్న
బరువెక్కిన హృదయమెడి
బీదవానిలో నున్నదా ఈ ప్రగతి?
　　కడు బీడు భూముల నుండి
　　కండరాలతో కాంచనాలు పండిస్తున్న
　　కాడినెత్తుకొని కాళ్ళనీడ్చుచున్న
　　కర్షకునిలో నున్నదా ఈ ప్రగతి?

కంచర్ల బాబూరావు

చేసిన ఫీల్డ్ ఇన్స్పెక్షన్ డాటాను కంప్యూటర్‌లో ఫీడ్ చేసుకుంటున్నాడు. మేధస్సుకు అసంపూర్తిగా అందుతున్న కంప్యూటర్ నాలెడ్జి ఎప్పటిలా తిప్పలు పెట్టిస్తుంది. చికాకు నుండి బయటపడ్డానికి కాస్సేపు రిలాక్సవ్వాలని వీల్‌చెయిర్ వెనక్కివాలి రెండు చేతులు తలకింద పెట్టుకొని కళ్ళు మూసుకున్నాడు. పైన ఫ్యాను రెండవ నెంబరుపై తిరుగుతుంది.

ఉషోదయం పవనంలాగా ఆయన నాసిక పుటల్లోకి చొచ్చుకుపోతుండగా సుగంధపరిమళాలు ఆ గాలిలో మిళితమై గిరీశంను ఉక్కిరిబిక్కిరి చేశాయి. కళ్ళు తెరిచాడు.''నమస్కారం సార్...!'' అన్న పలకరింపుతో ఒక్కసారిగా కుడివైపు తిరిగాడు.

జోడించిన రెండు చేతులు లావైన రాళ్ళు పొదిగిన ఉంగరాలు ట్యూబ్‌లైట్ల వెలుగులో తళుక్కున మెరిశాయి. గిరీశం కళ్ళు నలుముకొని ముందు జోడించిన రెండు చేతుల్ని తర్వాత మెరుగుపెట్టిన వెండిలాంటి వస్త్రాలను ధరించి ఎదురుగా నిలబడ్డ వ్యక్తిని చూసి బిత్తరపోయి చూస్తుండిపోయాడు.

''గుట్కా బందు చేశానండి...'' అంటూ 555 సిగరెట్ ప్యాకెట్ గిరీశం ముందు టేబుల్‌పై పెట్టి ''దాని ప్లేసులో ఇది తాగుతున్నానండి... ఇప్పుడిక్కడ తాగల్లేండి. పబ్లిగ్గా సిగరెట్టు తాగడం నేరం గదండీ...!'' అంటూ సిగరెట్ ప్యాకెట్‌ను తిరిగి జేబులో పెట్టుకున్నాడు.

''అరెరెరే... నువ్వటోయ్ వెంకటేశం...'' అంటూ బోల్డెంత ఆశ్చర్యాన్ని గుప్పించాడు గిరీశం.

''వెంకటేశం కాదుసార్...! సుగంధాల వెంకటేశ్... అలియాస్ వెంకట్...'' చిటికలేస్తూ ఎడమ చంకలో వున్న చిన్న లెదర్ బ్యాగ్‌ను టేబుల్‌మీదుంచాడు.

''అరెరెరెరె. నుంచున్నావేంటి కూచో కూచో''

## కన్నీటి భాష

రాలిపడే కన్నీటి బొట్లు
ఆగిపోయే ఉద్వేగాలతో
నిస్తేజపుకునికి పాట్లతో చేష్టలుడిగి
అనంతమైన ఆలోచనా తీరానికి
కాలం వెంబడి క్రీనీడల్లా సాగిపోతాయి
కన్నీటి పొరల్లో ఎన్నెన్ని బృహత్కథలో?
కన్నీటిది మూగభాష అనుకుంటే పొరపాటే
కన్నీళ్ళకు పలు వ్యాఖ్యానాలుంటాయి
అనేకానేక భాష్యాలుంటాయి
మనోలోకపు అనూహ్య స్పందనలే
కాలం కలసిరాక కెరటాల్లా ఉబికి వచ్చే కన్నీళ్ళు
అవి రమణీయ భావాలను,
రసాత్మక కావ్యాలను వర్ణించగలవు
నిత్య సత్యాలను ప్రవచించగలవు
అసత్యాలను ఉద్ఘాటించగలవు
కఠోర సత్యాలను ఆవిష్కరించగలవు
ఆర్తితో ఆత్మీయులకు వీడ్కోలు చెప్పగలవు
సంయోగ వియోగ సంవేదనలను
వడబోసి విడమర్చగలవు
సందర్భ సన్నివేశాలేవైనా,
గమ్యాన్ని చూపించే ఓదార్పే కన్నీరు
ప్రశాంత సౌరభాలను వెదజల్లే పన్నీరు
ఒక్క కుదుపులో మనస్సులను తేటపరచి
కార్యోన్ముఖుల్ని చేస్తాయి కన్నీళ్ళు.
ఆకాంక్షలు నెరవేరినప్పుడు
ఆ కన్నీళ్ళే ఆనందభాష్పాలై ఎగిసిపడతాయి
అవి మనిషికి అపురూపవరాలే
కష్టసుఖాలకు దర్పణాలే కన్నీళ్ళు
కన్నీళ్ళకు అస్థిత్వమున్నా
ఇచ్చి పుచ్చుకోవడం అంటూ ఉండదు
నిత్యజీవితంలో
కన్నీరుపెట్టించే పాషాణ హృదయాలకు
దుఃఖసముద్రపు ఘోష విన్పించదు
జీవితపు విలువల అవగాహన ఉండాలంటే
కన్నీటి స్పర్శ అనివార్యం
స్థిత ప్రజ్ఞయుత అనుభూతుల ప్రతీకలే
వర్షించని అశ్రునయనాలు...

ఆచార్య పి.వెంకటరెడ్డి

## చెదరని స్నేహం

బాల్యంలో
చెట్టాపట్టాలేసుకున్నా
యవ్వనంలో
రైలు పట్టాలులా
దూరదూరంగా ఉన్నా
వృద్ధాప్యంలో
వయసు వణికిస్తున్నా
చెదరనిదే
స్నేహం...

## నైజం

తుమ్మెద
పువ్వు పువ్వును
తాకటం
ఎంత సహజమో
మగవాడి చూపు
స్త్రీలపై పడటం
అంతే సహజం
అదే పురుషుని నైజం

## వజ్రం

ఓ
స్త్రీ
నీ వొక వజ్రానివి
అందుకే సానబెడుతున్నాడు
మగవాడు
వెలుగొందుతున్నావు
మెరుపుతో కూడిన బాధతో...

యలమర్తి అనూరాధ

అంటూ పక్కనున్న కుర్చీ లాగాడు గిరీశం.

''కూర్చునేంత టైము లేదండి... లోనుకూడా అక్కర్లేదండి...''

''అట్లా అనకండి అలియాస్ వెంకట్ గారు...! ఫ్రీజిం గెత్తేశారు... మీకు తప్పకుండా లోన్ దొరుకుతుంది...''

''ఉష్... మల్లా నన్ను బేకూఫ్‌ను చేయకండి... ఈ రోజు ఫ్రీజింగ్ లేకపోయినా నా బ్యాడ్ గెట్టప్పును చూసి బేకార్‌గాడ్ననుకొని గెంటించే ప్రయత్నం చేశారు...'' వెంకటేశం చిరుకోపానికి కాస్త కంగారుపడ్డాడు గిరీశం. తప్పు చేసినవాడిలా కించిత్ ఫీలైపోయి ''బెడ్రూం దగ్గరకొచ్చి ఆగిపోయిన నీ ఇంటికి లోన్ ఇవ్వకపోవడం తప్పే... మీలాంటి వారికి లోనిస్తే మా బ్యాంకు పరపతి పెరిగిపోతుంది...'' అంటూ రాబోతున్న డిపాజిట్టును పసిగట్టి కాకాపట్టే ప్రయత్నం చేశాడు గిరీశం.

''బెడ్రూమే కాదు... పైన గూడా ఫాల్‌సీలుంగుతో సహా రెండు బెడ్రూమ్‌లు వేశాను. స్ప్లిట్టేసీలు ఫిట్ చేయించాను, హోంథియేటర్ పెట్టించాను. ఇదిగో ఈ ఐదు లక్షలు నా భార్యపేరుమీద డిపాజిట్ చేస్తున్నాను...'' అంటూ చంకలోనున్న బ్యాగ్ జిప్‌లాగి అందులో వున్న 1000 రూపాయల కట్టలను చూపించాడు వెంకటేశం.

గుడ్లప్పగించి చూస్తూ మాటరాక అలాగే నోరు అప్పలించాడు గిరీశం.

''సిటీలో రియలెస్టేటు 'భూం'డెడ్డయింది గదా...! ఇప్పుడు పట్టణాల జనం పల్లెలమీద బడి భూములు కొనేస్తున్నారు. జీరాక్సు కాపీలు నా మొహంమీద కొట్టిన బాపతు ఎకరం భూమి బీడు భూమి కాదు కదండే... రేటొచ్చింది... ముప్పై ఐదులక్షలకమ్మేశాను...'' అంటూ వెంకటేశం ఇంకా ఏదో చెబ్తుండగా.

''బాబ్బాబు... నీకు పుణ్యముంటుంది. నాకూ ఉంది. రెండెకరాలు!... ఎన్నాళ్ళనుంచో బీడుపడిపోయింది. కావాలంటే కమీషన్ గిట్టుబాటు చేసుకొని దాన్ని అమ్మిపెట్టు...'' అంటూ ప్రాధేయపడ్డాడు గిరీశం.

''ముందా రెండకరాల భూమిని గట్టిగా దున్ని ఫలితం దక్కేలా చూడు'' అంటూ చిటికెలేస్తూ గిరీశం కళ్ళలోకి దెప్పిపొడుపుగా చూసి క్యాష్ కౌంటర్‌కేసి నడిచాడు వెంకటేశం, అలియాస్ వెంకట్.

అతని మాటల్లోని అంతరార్థం ఆలస్యంగా బుర్రలోకి చొచ్చుకుపోయేసరికి ''హరి పిడుగా...'' అనుకుంటూ రెండుచేతులూ తలవెనుక పెట్టుకొని చేర్‌లో వెనక్కి వాలిపోయాడు ఫీల్డాఫీసర్ గిరీశం. ■